

సిటియు టూరిజం గ్రాడ్యుయేట్లకు ప్లేస్‌మెంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీలో టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం 2019-2024 బ్యాచ్‌కు చెందిన ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబిఎ తొలి బ్యాచ్ గ్రాడ్యుయేట్లు ప్రముఖ కంపెనీల నుండి అద్భుతమైన ఉద్యోగ ఆఫర్‌లను పొందారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.వి కట్టిమణి ఉద్యోగ అవకాశాలను చేజిక్కించుకున్న విద్యార్థులకు నియామక లేఖలు అందజేసి అభినందించారు. ఈ బ్యాచ్ లో రిలీవ్ అయిన 100 శాతం మందికి డిపార్టుమెంట్ ప్లేస్‌మెంట్ అందించగలిగిందని, మొత్తం విద్యార్థులు ఐదు కంపెనీలు రిక్రూట్ చేసుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, డీన్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



మళ్లీ మోసమే

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఒరింగింది శూన్యం
- వెల్లువెత్తుతున్న విమర్శలు
- సమర్ధించుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో బిజెపి ప్రభుత్వం మరోసారి మోసం చేసింది. బడ్జెట్ ద్వారా ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరిగింది శూన్యం. జిల్లాకే కాదు, ఉత్తరాంధ్రాకి, రాష్ట్రానికి కూడా ప్రయోజనాలేవీ లేవని ప్రతిపక్ష వైసిపి, సిపిఎం, సిపిఐ తదితర పార్టీ నాయకులు మొదలు, మేధావులు, సాధారణ ప్రజానీకం వరకు విమర్శిస్తున్నారు. టిడిపి, జనసేన నాయకులు మాత్రం ఈ బడ్జెట్ రాష్ట్రానికి శుభ పరిణామం అంటూ సమర్ధించు కుంటున్నారు. మంగళవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు మినహా మిగిలిన ఏ ఒక్క అంశానికి కూడా నిర్ధిష్టమైన కేటాయింపులు లేవు. ఈ నిధులను కూడా ఆర్థిక సంస్థల ద్వారా సమకూరుస్తామని చెప్పడం గమనార్హం.

జిల్లాలో తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి ఎంత కేటాస్తారనేది చెప్పలేదు. గడిచిన ఆగస్టు 25న ఈ వర్శిటీ నిర్మాణ పనుల శంకుస్థాపన కేంద్ర కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రూ.834కోట్లు కేటాయించినట్టు ప్రకటించారు. కానీ, ఇప్పటికీ నిధులు విడుదల చేయలేదు. ఈ బడ్జెట్ సమావేశంలోనైనా నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసినవారికి నిరాశే ఎదురైంది. దేశంలోని ఉన్నత విద్యాసంస్థలన్నింటికీ కలిపి రూ.15,472కోట్లు కేటాయించారు. ఇందులోనే ఎంతో కొంత మన జిల్లాలోని గిరిజన వర్శిటీకి వస్తుందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఇది ఆవగింజలో అరవైవ వాటాయేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా మీదుగా కొత్తరైళ్ల ఏర్పాటు లేదా లైన్లు, స్టేషన్ల ఆధునీకరణ వంటి ప్రస్తావన కూడా లేదు. విశాఖ రైల్వే జోన్ ఊసేలేదు. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం తప్ప, అమలుపై చిత్తశుద్ధితో మాట్లాడలేదు. గతంలోనూ ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పినా అమలు కాలేదు. దీని అమలుపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. విభజన చట్టం ప్రకారం ఏటా రూ.50కోట్లు చొప్పున జిల్లాకు ఇవ్వవాల్సిన బిజెపి ప్రభుత్వం ఒకే ఒక్క సంవత్సరం ఇచ్చి ఆ తరువాత కేటాయించిన నిధులు కూడా వెనక్కి తీసుకుంది. ఈ లెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు రూ.64కోట్లు మించి అందలేదు. దీంతో, కీలకమైన విద్యాసంస్థలు, సాగునీటి ప్రాజెక్టులు, కొత్త పరిశ్రమలు అభివృద్ధి చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా పారిశ్రామిక వృద్ధి క్రమంగా కుంటుబడింది. జ్యూట్ పరిశ్రమలు దాదాపు కనుమరుగైపోతున్నాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జిల్లాపైనా, రాష్ట్రంపైనా మరోసారి చిన్నచూపు చూసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతా ఉత్తుత్తి మాటలు



కేంద్ర బడ్జెట్‌పై టిడిపి నాయకుల మాటలన్నీ ఉత్తుత్తివే. అంతా అమరావతి చుట్టూనే తిరుగుతున్నాయి. రాజధాని నిర్మాణం కోసం రూ.15వేల కోట్లు కేటాయిస్తామంటున్న మాటలు కూడా నమ్మశక్యంగా లేవు. కారిడార్లుకు కూడా నిధులు కేటాయించే పరిస్థితి లేదు. ఇక ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరిగిందేమీ లేదు. ఇటువంటి బడ్జెట్‌ను కూడా ఆహా ఓహో అంటూ టిడిపి నాయకులు చెప్పుకుంటున్నారు. వారి స్వప్రయోజనాలు, పదవుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారు.

మజ్జి శ్రీనివాసరావు, వైసిపి ఉత్తరాంధ్ర డిప్యూటీ కో-ఆర్డినేటర్

గిరిజన వర్శిటీకి నిధులేవి?



పదేళ్లు గడిచినా కేంద్రీయ గిరిజన యూనివర్శిటీకి నిధులు కేటాయించకపోవడం అన్యాయం. దీనిపై మన రాష్ట్రానికి చెందిన పాలకులు మాట్లాడకపోడం మరీ దారుణం. ప్రత్యేక ప్యాకేజీ కూడా విడుదల చేయకపోవడం వల్ల విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం సహా ఉత్తరాంధ్ర వెనుకబడిపోతోంది. సాగునీటి ప్రాజెక్టులు లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నాయి. పారిశ్రామిక వృద్ధి కుంటుబడింది. వ్యవసాయ రంగం దివాలా తీసింది. సేవారంగంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఎం.శ్రీనివాసా, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ

బిజెపి మోసాలు పునరావృతం



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మోసాలు మళ్లీ మళ్లీ పునరావృతమౌతునే ఉన్నాయి. దీన్నిబట్టి మన రాష్ట్రంపై వివక్ష, చిన్నచూపు చూస్తుందన్నది అర్థం చేసుకోవాలి. ప్రత్యేక హోదా, వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ వంటి విభజన హామీలు అమలు చేయలేదు. ఎపి మద్దతుతో దేశంలో అధికారం చలాయిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలదీసేందుకు టిడిపి, జనసేన నాయకులు వెనుకాడుతున్నారు. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసి అధికారంలోకి రావడం వల్ల విభజన హామీల అమలుకు ప్రయత్నిస్తాయని ప్రజలు పెట్టుకున్న ఆశలను ఆయా పార్టీలు అడియాశలు చేశాయి.

తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రత్యేక హోదా ప్రస్తావన లేని బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రస్తావనలేదు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం శుభ పరిణామం అయినప్పటికీ బడ్జెట్‌లో పోలవరం నిర్వాసితుల సమస్యలు గాని, ప్రత్యేక కేటాయింపులు గాని లేవు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు గతంలో రూ.50 కోట్లు ఇచ్చేవారు. ఇప్పుడు అటువంటిదేమీ ప్రకటించలేదు.కాబట్టి ఖుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజి ఇవ్వాలి. విశాఖ రైల్వేజోన్ ప్రస్తావన లేదు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు ఎటువంటి కేటాయింపు లేదు అధ్వానంగా ఉన్న రోడ్లకు నిధులు కేటాయించలేదు. **- ఒమ్మి రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి**

రాష్ట్రానికి మహర్దశ



దేశంలో ఎన్‌డిఎలో టిడిపి భాగస్వామ్యం కావడంతో రాష్ట్రానికి శుభపరిణామమే. రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయిండం శుభ పరిణామం. ఇది చంద్రబాబు అపార అనుభవంతో సాధ్యపడింది. గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి కేంద్రం నుంచి ఎటువంటి నిధులూ తెచ్చుకోలేకపోయారు. రానున్న రోజుల్లో మరెన్నో నిధులను మన రాష్ట్రం పొందే అవకాశముంది.

కిమిడి నాగార్జున, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు

అభివద్ధికి దోహదం చేసే బడ్జెట్

కేంద్ర బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేలా ఉంది. రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తి కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించడం అభినందనీయం. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు విడుదల ప్రకటన శుభపరిణామం. **-గురాన అయ్యలు, జనసేన నాయకులు**



సిపిఎం విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

బలమైన ప్రజా ఉద్యమాలు చేపట్టాలి


- రాజ్యాంగ రక్షణకు లౌకికశక్తులతో కలిసి ఐక్య పోరాటాలు
- జిల్లా ప్లీనంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రాబోయే కాలంలో బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మత తత్వ బిజెపి నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు లౌకిక శక్తులతో కలిసి ఐక్యపోరాటాలు చేస్తామని తెలిపారు. సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.లక్ష్మి అధ్యక్షతన మంగళవారం ఎన్‌పిఆర్ భవనంలో జరిగింది. ముందుగా సిపిఎం జెండాను పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అమరుల స్థూపం వద్ద సభ్యులంతా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన మతోన్మాద విధానాలను ముందుకు తీసుకెళ్లే చర్యలను వేగవంతం చేస్తోందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావొచ్చు అని జీవో ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. నేడు దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రభుత్వ పరిపాలన వ్యవస్థలో హిందూ భావజాలాన్ని పెంపొందించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. దేశ సమగ్రతకు, సమైక్యతకు ప్రమాదం పొంచి ఉన్నందున రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన కర్తవ్యం అందరిపైనా ఉందని అన్నారు. ఇందుకోసం కలిసి వచ్చే శక్తులను కలుపుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్రం తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, పోలవరం నిధులు, నిర్వాసితుల సమస్యలు, విశాఖ ఉక్కు కర్మాగారం కోసం ప్రత్యేక నిధులు కేటాయింపు గురించి ప్రస్తావన లేదన్నారు. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వాములుగా ఉన్న టిడిపి ఎంపీలు రాష్ట్ర హక్కుల కోసం గలమెత్తాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదన్నారు. కార్మికుల కనీస వేతనాలు, ఉద్యోగుల సమస్యలు, రైతులకు పంటల గిట్టుబాటు ధర, విద్యారంగ సమస్యలు, ఉద్యమాలపై అణచివేత తదితర అంశాలపై ప్రస్తావన లేదన్నారు. సిపిఎస్ రద్దు కోసం ఎటువంటి ప్రకటన లేదన్నారు. రాబోయే కాలంలో ప్రజలు, ఉద్యోగులు, రైతుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు తీసుకునే చర్యలపై నిర్ధిష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ రాబోయే కాలంలో పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కర్తవ్యాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విభజన హామీల అమలుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, వెనుక బడిన విజయనగరం జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివద్ధికి రూ.20వేల కోట్లు కేటాయించాలని, మూతపడిన పరిశ్రమలు తెరిపించాలని, మహిళలు, పిల్లల పై అత్యాచారాలను అరికట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, పి.శంకరరావు, టివి రమణ, జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట



టూటౌన్ స్టేషన్‌లో సిఐలు, ఎస్‌ఐలతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. నేరాల నియంత్రణకు రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని అన్నారు. మంగళవారం నగరంలోని వన్‌టౌన్, టూ టౌన్, క్రైం పోలీసుస్టేషన్లను పరిశీలించారు. లాకప్, ప్రొపర్టీ గదులను పరిశీలించారు. స్టేషను ప్రాంగణంలో సీజ్ చేసిన వాహనాలు ఏ కేసులోనిది అన్న విషయం తెలిసే విధంగా ట్యాగ్ చెయ్యాలని సూచించారు. స్టేషనులో పని చేస్తున్న ఎసైలను ఎప్పటి నుండి ఇక్కడ పని చేస్తున్నది. గతంలో ఎక్కడ పని చేసినది అడిగి తెలుసుకున్నారు. స్టేషను పరిధిలో ఏ తరహా నేరాలు జరుగుతున్నది అడిగారు. గంజాయి సేవించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రకు దాడులు ముమ్మరం చేయాలని, ఆకస్మికంగా లాడ్జిలు, వాహనాలు తనిఖీ చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చి, తాత్కాలికంగా నివాసం ఏర్పరుచుకునే వ్యాపారులపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. వారు చేసే వ్యాపారులు, తీసుకు వస్తున్న సరుకులు, వాటిని స్టోర్ చేసే గోడౌన్ లను తనిఖీ చేయాలన్నారు. లంకా పట్టణం, వైఎస్‌ఆర్ నగర్, దాసన్నపేట, గాజులరేగ ప్రాంతాల్లో యువతను చైతన్యపర్చి కౌన్సిలింగ్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డిఎస్‌పి ఆర్.గోవిందరావు, 2వ పట్టణ సిఐ కె.రామారావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ కెకెవి విజయనాథ్, వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, ఎస్‌ఐలు ఐ.దుర్గా ప్రసాద్, రాజేష్, మురళీ, నరేష్, తారకేశ్వరరావు, హరిబాబునాయుడు తదితరులు ఉన్నారు.

అదునుకు 'ఎరువు' కరువు

- రైతులకు తప్పని ఎదురుచూపులు
- సొసైటీలకు ఇంకా చేరని వైనం
- ప్రయివేటు బారిన రైతాంగం

ప్రజాశక్తి - జామి

అదును కుదిరింది.. ఎరువు దరి చేరకుంది.. ఇదే గ్రామీణ రైతులను ప్రస్తుతం వెంటాడుతున్న ప్రధాన సమస్య. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలు మండలాల్లో ముమ్మరంగా ఉబాలు జరుగుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో ప్రతి రైతుకూ ఎరువు అవసరం. కానీ రైతులకు కనుచూపు మేరలో ఎరువు కానరావడం లేదు. ఈ నేపథ్యంలోనే ప్రయివేటు వ్యాపారులు అధిక ధరలతో అన్నదాతను కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం కోపరేటివ్ సొసైటీల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. కానీ ఇంత వరకూ ఏ సొసైటీకీ ఎరువు చేరక పోవడంతో ఈ ఖరీఫ్‌కు అన్నదాతకు ఎరువు కష్టాలు తప్పేలా లేవు. ఈనేపథ్యంలో ప్రైవేటు షాపులను ఆశ్రయిస్తున్నారు.

జిల్లాలో సుమారు 2.30లక్షల ఎకరాల్లో వరి సాధారణ విస్తీర్ణం కాగా, గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉబాలు ఊపందుకున్నాయి. 40 నుంచి 50 శాతం రైతులు యద వేయగా, డ్రమ్ముసీడర్, ఉడుపులు కలుపుకుని సుమారుగా 50శాతం 60శాతం నాట్లు వేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి దమ్ముల్లోగాని, ఆ తరువాత వారం రోజుల్లో గాని డిఎపి ఎరువును వేస్తారు.కానీ రైతులకు మాత్రం ఎరువులు అందుబాటులో లేవు. ఇప్పటికే ఆర్‌బికెల్లో అరకొర ఎరువులు నిల్వ ఉన్నప్పటికీ సామాన్య రైతుకు ఎరువు అందడం లేదని ఆందోళన చెందుతున్నారు.

జామి మండలంలో 13వేల ఎకరాల్లో వరి సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటికే 60శాతం పైగా ఉబాలు పూర్తయ్యాయి. అధికారులు లెక్కల ప్రకారం 320 బస్తాలు యూరియా, 180 డిఎపి అందుబాటులో ఉన్నాయి. కానీ మరో వారం రోజుల్లో ఎరువు అవసరం చూస్తే, అందుకు తగ్గట్టు నిల్వలు లేవు. అధికారులు మాత్రం ప్రభుత్వం సొసైటీల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తామని చెబుతున్నారు. కానీ సొసైటీలకు మాత్రం ఇంతవరకు ఎరువులు చేరలేదు.



ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా ఎరువులు కొరత చుట్టూముట్టే ప్రమాదం లేకపోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయివేటున అధిక ధరలు

ప్రభుత్వం అదును సమయానికి ఎరువు అందించక పోవడంతో అన్నదాత ప్రయివేటు షాపుల దోపిడీ బారిన పడుతున్నాడు. ప్రభుత్వం రాయితీ పోను రూ. 266కు యూరియా అందజేయాలి, కానీ ఆర్‌బికెల్లో రూ. 280 వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి. ప్రయివేటు దుకాణల్లో అయితే రూ. 300 నుంచి రూ. 330 పైమాటే. డిఎపి బస్తా రూ. 1350కు ఇవ్వాలి. కానీ అదును పేరుతో అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు సమాకూర్చాలని, ప్రయివేటు దోపిడీని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



ప్రశంసాపత్రాలతో విజయం సాధించిన క్రీడాకారులు

బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారుల హవా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని డిఎస్‌సి ఇండోర్ స్టేడియంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్, ఎంపిక పోటీల్లో విజయనగరం సిటీ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు అన్ని విభాగాలలోను సత్తా చాటారని కోచ్ జి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం విసిబిఎ అధ్యక్షులు డాక్టర్ వి ఎస్ ప్రసాద్, కార్యదర్శి నున్న సురేష్ గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు డాక్టర్ కెఎ నాయుడు, కార్యదర్శి నున్నా సురేష్‌ను సన్మానించారు. త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మరింతగా శిక్షణ ఇచ్చి జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారు చేయాలని ఆకాంక్షించారు.

సామిల్లు టింబర్ డిపో అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

విజయనగరం టౌన్ : ది విజయనగరం జిల్లా సామిల్లు టింబర్ డిపో అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడుగా బొద్దల ఆనంద్, కార్యదర్శిగా పెద్దబాబు, జనరల్ సెక్రెటరీగా సాంబ, గౌరవ అధ్యక్షుడిగా ముక్కాల రాము తో మొత్తం 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దల ఆనంద్ మాట్లాడుతూ అసోసియేషన్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి కషి చేస్తామన్నారు. టింబర్ డిపోల్లో వ్యాపారం సక్రమంగా నిర్వహించాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాటర్ ప్లాంట్ల తనిఖీలు

- అనుమతి లేని ప్లాంట్లు సీజ్
- తహాశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో సోదాలు
- అన్ని అనుమతులూ ఉన్న ప్లాంట్లు 17 మాత్రమే
- ట్రస్టుల పేరుతో జోరుగా విక్రయాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడానికి కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శ్రీకారం చుట్టారు. ఆయన ఆదేశాలతో మంగళవారం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాటర్ ప్లాంట్లను తాహాశీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తనిఖీలు చేశారు. మున్సిపల్ ప్రాంతాల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. జిల్లాలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్, ఫుడ్ సేఫ్టీ వారి నుంచి అనుమతి పొందిన ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంటు కేవలం 17 మాత్రమే ఉన్నాయి. ఈ ప్లాంటు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం నిర్వహిస్తున్నారు. ఇవి కాకుండా మరో 63 ప్లాంటు ఎటువంటి అనుమతులూ లేకుండానే నీటిని ప్యాక్ చేసి, ప్యాకెట్లు, లీటరు బాటిళ్లలో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అనుమతి లేని ప్లాంట్ల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. అదేవిధంగా ట్రస్ట్ ల పేరుతో చాలా చోట్ల వాటర్ ప్లాంటు నిర్వహిస్తున్నారు. వీరు 20 లీటర్ల క్యాన్లతో తాగునీటిని విక్రయిస్తున్నారు. ఇంటింటికి కూడా ఈ క్యాన్లలో నీటిని సరఫరా చేస్తున్నారు. ఇలా లక్షల రూపాయల నీటి వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి ట్రస్టుల ద్వారా ఆర్ఒ ప్లాంట్లను ఏర్పాటు చేసి నీటిని విక్రయించేవారు క్యాన్లలో నీటిని సరఫరా చేయకూడదు. ప్లాంటు వద్ద నామమాత్రపు రుసుం తీసుకొని, వినియోగదారులు తెచ్చుకున్న పాత్రలో నీటిని నింపి ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న ఆర్ఒ ప్లాంట్లు తక్కువగానే ఉన్నాయి. ఆర్ఒ ప్లాంట్ల తనిఖీల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న పలు వాటర్ ప్లాంట్లు బయటపడ్డాయి. కేవలం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే మొత్తం 31 వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయగా, వీటిలో 4 ప్లాంట్లకు మాత్రమే అనుమతి ఉన్నట్లు తేలింది. అనుమతులు లేని వాటిని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఇలా ప్రతీ మండలంలో తాహాశీల్దార్ల ఆధ్వర్యంలో చేసిన తనిఖీల్లో, ఎక్కువ ప్లాంట్లు అనధికారికంగా ప్యాకేజి వాటర్ ను విక్రయిస్తున్నట్లు తేలింది. వీటన్నిటిపైనా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.కొత్తవలస మండలంలో మొత్తం 12 ఆర్ఓ ప్లాంట్లను తనిఖీ చేయగా, వాటిలో 9 ప్లాంట్లకు అనుమతులు లేవని తేలింది. బొండపల్లి మండలంలో పది వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి, అన్నిటికీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.



గజపతినగరంలో వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

సురక్షిత నీటిని మాత్రమే అందించాలి : కలెక్టర్

ఆర్ఒ ప్లాంట్ల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు మాత్రమే అందించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు.. ప్లాంటుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తప్పనిసరని, అనుమతులు లేని ఆర్ఒ ప్లాంట్లను మూసివేస్తామని తెలిపారు..

దోమల నియంత్రణకు చర్యలు : కమిషనర్

ప్రజాశకి-విజయనగరం టౌన్

కాలానుగుణ వ్యాధులకు దోమలే ప్రధాన కారణమని, వాటి నియంత్రణ బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు పేర్కొన్నారు. మంగళవారం కాటవీధి తదితర ప్రాంతాలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లో దోమలు వృద్ధి కాకుండా చూడాలని ప్రజలను కోరారు. దోమల నియంత్రణకు తాము అన్ని విధాలా చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రజలు కూడా సహకరించాలన్నారు. ప్రధానంగా నీటి నిల్వలు లేకుండా ప్రతిరోజు శుభ్రపరచుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలలో ఉన్న టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కాటవీధి పాఠశాలకు చేరుకుని విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చారు. నిరుపయోగంగా పడి ఉన్న టైర్లలో, కొబ్బరి చిప్పలలో, గుంతలలో, ఎయిర్ కూలర్లలో ఎక్కువగా నీరు నిల్వ ఉండిపోతుందని అవే దోమలకు వృద్ధి కేంద్రాలుగా నిలుస్తున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు తప్పనిసరిగా వాడుకోవాలని అన్నారు. చిన్నపిల్లల పట్ల మరింత జాగ్రత్తగా ఉండి దోమలు దరిచేరకుండా చూడాలన్నారు. అనారోగ్యం గురైన వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి తక్షణమే వైద్య సహాయం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎంఎం నాయుడు

పాఠశాలను తనిఖీ చేసిన డిసిఇ

వేపాడ: వేపాడ గురుకుల పాఠశాలను డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ టిఎమ్ ఫ్లోరెన్స్ మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా శిక్షా సప్తహ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. భోజనాలను పరిశీలించి వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, డార్మిటరీలను పరిశీలించారు. టీచర్స్‌తో మీటింగ్ ఏర్పాటు చేసి రికార్డ్స్ తనిఖీ చేశారు. ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు.

సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి

నెల్లిమర్ల: డైట్ డిఇడి–2 018 ఫెయిలైన ప్రభుత్వ డైట్, ప్రయివేట్ డైట్ విద్యార్థులు సప్ల మెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ జి. పగడాలమ్మ కోరారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సప్లమెంటరీ ఫీజు వచ్చే నెల 4లోగా చెల్లించాలని, ఆలస్య రుసుంతో ఆగస్టు 20లోగా ప్రిన్సిపాల్ పేరిట చెల్లించాలని కోరారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు అలేఖ్య

సతివాడలో ఉచిత కంటి వైద్య శిబిరం

నెల్లిమర్ల: మండలంలోని సతివాడలో మంగళవారం సర్పంచ్ రేవళ్ళ శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని 56మందికి కంటి పరీక్షలు నిర్వహించి 24మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ అలేఖ్య, క్యాంప్ కో ఆర్డినేటర్ జోగారావు, గ్రామపెద్దలు త్రినాథ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాద్ జయంతి

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్ కేశవరావు మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ స్వతంత్రం కోసం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన గొప్ప వీరుడని 24 సంవత్సరాలకే భరతమాత ఒడిలో చేరారని కొనియాడారు. అధ్యాపకులు చల్ల శ్రీనివాసరావు చంద్రశేఖర్ ఆజాద్ జీవిత చరిత్ర విద్యార్థులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే వాసుదేవరావు, ఐక్యూసి కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఒ ఈరన్న, భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని దిబ్బలపాలెం, ఆర్అండ్‌బి, విశ్వబ్రాహ్మణవీధి ప్రాంతాలలో మంగళవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురవడంతో రోడ్డుపై చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తి వేయాలని, కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. చిరువ్యాపారులు రోడ్డుపై షాపులు పెట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా షాపులను లోపలకు పెట్టాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీ, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

ఆధార్ శిబిరాలను ఉపయోగించుకోవాలి

భోగాపురం: సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాలను ఉపయోగించుకోవాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరుగుతుందని అన్నారు. ఆధార్ కార్డులో తప్పులను సరి చేసుకోవడం, అప్‌డేట్ చేసుకోవడానికి, బయోమెట్రిక్, కొత్త ఆధార్ నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ శిబిరాలకు మహిళా పోలీసులను ఇన్‌చార్జి నియమించామని చెప్పారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని సైకిలిస్టు మృతి

విజయనగరం కోట: నగరంలోని సంతకాల వంతెన సమీపాన ముద్దాడ శ్రీనివాసరావు (50) మృతి చెందాడు. ఆర్టిసి కాంప్లెక్స్ నుంచి ఎత్తుబ్రిడ్జి మీదుగా ఆర్అండ్‌బివైపు సైకిల్ పై వెళ్తున్న శ్రీనివాసరావును పార్వతీపురం వైపు వెళ్తున్న ఆర్టిసి బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని హోంగార్డు రమణ, స్థానికులు వెంటనే జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కాలుపైకి టైర్ ఎక్కిపోవడంతో కాలు నుజ్జునుజ్జు అయ్యింది. తీవ్ర రక్త స్రావం కావడంతో శ్రీనివాసరావు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

భోగాపురం: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని భోగాపురం గ్రామానికి చెందిన వసాది సోములు (47) మృతి చెందినట్టు సీఐ రవికుమార్ తెలిపారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. హైవేపై వెళ్తున్న వాహనదారులు టోల్‌ప్లాజా సమాచారం ఇవ్వడంతో ఈ ప్రమాద విషయం పోలీసులకు తెలిసింది. దీనిపై విచారణ జరిపిన పోలీసులు మృతి చెందిన వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదంపై ఫిర్యాదు

భోగాపురం: చనిపోయిన వ్యక్తి పేరు మీద అదే పేరు కలిగిన మరో వ్యక్తితో తన భూమిని వేరొక వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఒక వృద్ధ గ్రామ పెద్దలతో కలిసి పోలీసులను మంగళవారం ఆశ్రయించారు. అంతేగాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. రావాడ గ్రామానికి చెందిన బుత్తల వల్లం రాజు తండ్రి కొన్నేళ్ల క్రిందట భూమిని కొనుగోలు చేసాడు. ఆ వ్యక్తి చనిపోవడంతో అదే పేరు కలిగిన మరో వ్యక్తితో ఆయన కుటుంబ సభ్యులకు రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్‌తో కూడా గ్రామ పెద్దలు మాట్లాడడంతో సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిసింది.

మూర్ఛతో మహిళ మృతి

మెరకముడిదాం: పొలంలో వరినాట్లు వేస్తుండగా వివాహితకు మూర్ఛ వచ్చి మృతి చెందిన ఘటన మండలంలోని ఊటపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. బుధరాయవలస ఎస్ఐ లోకేశ్వర రావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన బొత్స హైమావతి (27) ఉదయం పొలంలో వరినాట్లు వేస్తుండగా మూర్ఛ వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు సిఐ ఆధ్వర్యంలో ఘనటా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరు వ్యాపారులకు చినుకు దెబ్బ

- ఐదు రోజులుగా వర్షాలు
- ముందుకు సాగని వ్యాపారాలు
- ఆందోళన చెందుతున్న తోపుడు బళ్ల వ్యాపారులు

ప్రభుత్వం ఎటువంటి రాయితీలు, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోయినా తమ కాళ్లపై తాము నిలబడి పనిచేసుకుని జీవించాలనే తపనతో తోపుడు బళ్ల వ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. గత ఐదు రోజులుగా వర్షాలు పడటంతో తోపుడు బళ్లు, ఆరుబయట వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల వల్ల తోపుడు బళ్లపై వ్యాపారాలు సాగడం లేదు. ఫలితంగా వ్యాపారులంతా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఏ రోజు తీసుకొచ్చిన సరుకు ఆ రోజు అమ్ముడు కాకపోతే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వ్యాపారాలు ముందుకు సాగడం లేదు. ఫలితంగా చాలా మంది తోపుడు బళ్లు దుకాణాలు మూసేశారు.

ప్రజాశక్తి – శృంగవరపుకోట

పట్టణంలోని సుమారు రెండు వేల మందికి పైగా తోపుడు బళ్లు, ఆరుబయట చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిలో యాభై శాతం ఎస్‌సి సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నారు. వీరి ద్వారా ప్రభుత్వానికి లక్షల రూపాయలు పన్నుల రూపంలో ముడుతున్నప్పటికీ వారికి సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. ఫలితంగా ఎండకు ఎండి వానకు తడుస్తూ వ్యాపారాలను సాగిస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోపుడు బళ్లు, ఆరుబయట వ్యాపారం చేసుకునే వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుబయట వ్యాపారాలు సాగడం కష్టంగా మారింది. ముఖ్యంగా తోపుడు బల్లకు ఎటువంటి రక్షణ లేకపోవటం వల్ల వర్షం పడితే కచ్చితంగా వ్యాపారితో పాటు బండిపై ఉన్న సరుకు తడిసి పోవాల్సి వస్తుంది.

సుప్రీమ్ కోర్టు ఆదేశాల భేఖాతర్

వీధి వ్యాపారం ఒక జీవనాధారమని, అది ప్రజల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో 2014లో కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల జీవనాధార రక్షణ చట్టం కూడా చేసింది. చట్ట ప్రకారం వ్యాపారులకు లైసెన్సులు, గుర్తింపు కార్డులు, సబ్సిడీ రుణాలు, వ్యాపార ప్రదేశాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించాలి. ఎట్టి పరిస్థితులలోనూ దుకాణాలను ప్రభుత్వం గాని అధికారులు గాని తొలగించకూడదని చట్టంలో పేర్కొంది. ప్రభుత్వం కార్మికులకు సౌకర్యాలు కల్పించకపోగా రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వారిని అధికారులు వేధిస్తున్నారని వాపోతున్నారు.

కూలి చేస్తేనే కూడు దొరికేది

నేను ప్రతిరోజూ యాపిల్, దానిమ్మ, జామ తదితర పండ్లను తోపుడు బండిపై అమ్మటానికి కూలికి వెళుతూ ఉంటాను. వచ్చే కూలి డబ్బులతో ఏ రోజుకు ఆ రోజు నిత్యావసరాలు కొనుక్కుంటు కుటుంబ పోషణ సాగిస్తున్నాను. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. తోపుడు బళ్ల పైన ఆరుబయట వ్యాపారాలు చేసుకునే వారికి ప్రభుత్వం రుణాలిచ్చి ఆదుకోవాలి



– అప్పారావు కూలి, శ్రీనివాస కాలనీ



గొడుగులు వేసుకుని వ్యాపారం చేస్తున్న మహిళలు

వర్షాకాలం దినదిన గండమే

వర్షాకాలమంతా దినదిన గండంగా గడపాల్సి ఉంటుంది. వేల రూపాయలు పెట్టి సరుకు తీసుకొచ్చిన తరువాత చాలా సందర్భాల్లో వర్షం కురవడంతో సరుకంతా తడిచి కుళ్ళిపోయి తీవ్రంగా నష్టపోతున్నాం. సరుకు పేర్చిన తర్వాత అమ్మినా అమ్మకపోయినా పంచాయతీకి ఆశీలు కట్టడం తప్పడం లేదు. వర్షాకాలంలో రోడ్లపై వ్యాపారం చేసుకునేవారు ఇబ్బందులను గుర్తించి సరుకులు పాడవకుండా సౌకర్యాలు కల్పించి వర్షాకాలంలో పంచాయతీ ఆశీలు వసూలు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

మీసాల బంగారమ్మ, తోపుడు బండి వ్యాపారి

బొబ్బిలిలో చెలరేగిపోతున్న ఆకతాయిలు

- ఎస్‌టి బాలికల హాస్టల్‌కు వెళ్లే విద్యార్థినులపై వేధింపులు
- ఈవ్‌టీజర్ల నుంచి రక్షణ కల్పించాలని ర్యాలీ

ప్రజాశక్తి– బొబ్బిలి

బొబ్బిలిలో ఆకతాయిలు చెలరేగిపోతున్నారు. సింహాలతోటలో ఉన్న ఎస్‌టి కళాశాల బాలికల వసతి గృహానికి వెళ్లే విద్యార్థినిలను ఆకతాయిలు అడ్డగించి వేధింపులకు పాల్పడుతున్నట్లు విద్యార్థినిలు వాపోతున్నారు. కళాశాలలు విడిచి పెట్టే సమయంలో పట్టణంలో ఆకతాయిలు అమ్మాయిలను ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మాయిలు, విద్యార్థినిలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. విద్యార్థినిలకు రక్షణ కల్పించి ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణి కుమార్, విద్యార్థినిలు కోరుతున్నారు.

ఎస్‌టి బాలికల హాస్టల్‌కు వెళ్లే విద్యార్థినిలపై వేధింపులు

సింహాలతోటలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కెజిబివి పాఠశాల, ఎస్‌టి కళాశాల బాలికల వసతి గృహం ఉన్నాయి. ఎస్‌టి కళాశాల బాలికల వసతి గృహంలో ఉండే విద్యార్థినిలు ప్రతిరోజు పట్టణంలో ఉన్న కళాశాలలకు వచ్చి వెళ్తుంటారు. సాలూరు రైల్వే ట్రాక్ నుంచి వసతి గృహం వరకు నిర్మానుష్యంగా ఉండడంతో ఆకతాయిలు కాపు కాసి విద్యార్థినిలను వేధిస్తున్నారు. కళాశాల నుంచి వసతి గృహానికి సోమవారం సాయంత్రం ఒంటరిగా నడుచుకుని వస్తున్న ఒక విద్యార్థినిని ఒక ఆకతాయి వెనక నుంచి పట్టుకుని నోరు మూసి రోడ్డు పక్కనున్న నిర్మాణంలో ఉన్న ఒక ఇంటిలోకి తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా విద్యార్థిని తప్పించుకుని పరిగెత్తుకుని హాస్టల్‌కు వెళ్లింది. ఇలా ప్రతి రోజూ సంఘటనలు జరుగుతున్నా పోలీసులు నోరుమెదపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా విద్యార్థినిని ఆకతాయి అడ్డగించడంతో హాస్టల్ నుంచి కళాశాలకు వచ్చేందుకు భయపడుతున్నారు.



సిఐకు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

పట్టణంలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో విద్యార్థినిలను ఆకతాయిలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. పూల్ బాగ్ జంక్షన్, స్టైల్ బజార్ జంక్షన్‌లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ జరుగుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల, పాఠశాల అధ్యాపకులు చెపుతున్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ నివారణపై పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈవ్ టీజింగ్‌పై చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

ఆకతాయిలు నుంచి రక్షణ కల్పించాలని ర్యాలీ

ఆకతాయిలు నుంచి రక్షణ కల్పించాలని ఎస్‌టి బాలికల కళాశాల విద్యార్థినిలు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ చేశారు. అనంతరం పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. హాస్టల్ నుంచి కళాశాలకు వచ్చే సమయంలోను, కళాశాల నుంచి హాస్టల్‌కు వెళ్తున్న సమయంలో ఆకతాయిలు వేధిస్తున్నారని విద్యార్థినిలు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం జరిగిన ఘటనతో మరింత భయపడుతున్నట్లు సిఐకు వివరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ లైంగిక వేధింపులు, అత్యాచారాలు నివారించాలని, ఈవ్ టీజింగ్ నివారణకు ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు.

విద్యార్థినిలకు వైద్య పరీక్షలు

తెర్లాం: మండలంలో కుమ్మరపేట కెజిబివి పాఠశాల విద్యార్థినులకు తెర్లాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డి.దివ్యభారతి మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మికు సూచించారు. విద్యార్థినులకు ఇటీవల జ్వరాలు రావడంతో ఈ వైద్య పరీక్షలు నిర్వహించామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగునాయుడు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై టిడిపి నాయకుల హర్షం

ప్రజాశక్తి– డెంకాడ

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం వెనుకబడిన ప్రాంత నిధుల కింద ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక గ్రాంట్స్, అమరావతి రాజధాని నిర్మాణం కోసం రూ.15వేల కోట్లు బడ్జెట్ లో కేటాయించినందుకు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి టిడిపి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్, పతివాడ అప్పలనారాయణ మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ఎన్‌డిఎ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్‌రావు, కలిదిండి పాణీరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కల్పనకు ప్రాధాన్యత: పీడీ

ప్రజాశక్తి– బొబ్బిలి

మహిళల స్వయం ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం బ్యాంక్ రుణాలను మంజూరు చేస్తున్నట్లు మెప్మా పీడీ బి.సుధాకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలు స్వయం ప్రతిపత్తి పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంక్ లింకేజీ రుణాలు, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. వీధి వ్యాపారులకు పిఎం స్వనిధి రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. విజయనగరం కార్పోరేషన్‌లో 1400 మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.56కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా 291 సంఘాలకు రూ.28.37 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. బొబ్బిలి మున్సిపాలిటీలో 560 సంఘాలకు రూ.22.40కోట్లకు 45 సంఘాలకు రూ.3.76కోట్లు మంజూరు చేశామన్నారు. నెల్లిమర్ల మున్సిపాలిటీలో 336 సంఘాలకు రూ.13.44కోట్లకు గాను 14 సంఘాలకు కోటి 41లక్షల 90వేలు మంజూరు చేశామన్నారు. రాజాం మున్సిపాలిటీలో 560 గ్రూపులకు రూ.22.40కోట్లకు 22 సంఘాలకు 2కోట్ల 8లక్షల 15వేలు మంజూరు చేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం ద్వారా 226 మందికి ఒకొక్కరికి రూ. లక్ష చొప్పున రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం ద్వారా 10 గ్రూపులకు 30లక్షలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా రుణాల రికవరీ బాగుందన్నారు. రికవరీ బాగుండడంతో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు వస్తున్నారని చెప్పారు.

వీధి వ్యాపారులకు పిఎం స్వనిధి రుణాలు

వీధి వ్యాపారులకు పిఎం స్వనిధి రుణాలు మంజూరు చేయాలని ఆర్పీలను మెప్మా పిడి బి.సుధాకర్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులను గుర్తించి పిఎం స్వనిధి రుణాలు మంజూరు చేయాలన్నారు. పిఎం స్వనిధి రుణాలు పొందిన వారి వివరాలు ఆన్లైన్ చేయాలన్నారు. సమావేశంలో మెప్మా ఐపి కిషోర్, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు

కౌలు రైతులకు రుణాలు ఇవ్వండి

ప్రజాశక్తి – బొబ్బిలిరూరల్

కౌలు రైతులకు రుణాలు మంజూరు చెయ్యాలని వ్యవసాయ శాఖ ఎడి యం.శ్యాంసుందర్ బ్యాంకర్స్‌ను కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి అధ్యక్షతన బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఎడి మాట్లాడుతూ మండలంలోని 790 మంది కౌలు రైతులను గుర్తించామని వారికి రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్స్ ఇబ్బందులు పెడుతున్నారని యూనియన్ బ్యాంక్ వారు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. అప్పులు తీర్చే రైతుల వివరాలు అప్‌లోడ్ చెయ్యాలని, ఈ విధంగా చేయక పోవడం వల్ల రైతులకు వడ్డీమాఫీ అందని పరిస్థితి ఉందని అన్నారు. హార్టికల్చర్ అధికారి రత్నం మాట్లాడుతూ రైతులకు మొక్కల పెంపకానికి రుణాలు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. మెప్మా పీడీ సుధాకర్ మాట్లాడుతూ బ్యాంక్‌ల్లో పొదుపు సంఘాల వద్ద నుంచి సర్వీస్ చార్జీలు వసూలు చేయవద్దని కోరారు. డిఆర్‌డిఎ పీడీ పొదుపు సంఘాల్లో కార్పస్ ఫండ్‌ను సంఘాలకు అప్పులు ఇవ్వాలని తెలిపారు. రికవరీ భాధ్యతలను తమ సిబ్బందితో చెయ్యియించేందుకు భాధ్యత తీసుకుంటామని పీడీలు తెలిపారు. సిఎస్‌పి పాయింట్ల వద్ద ఇబ్బందులు ఉన్నాయని డిఆర్‌డిఎ పీడీ తెలిపారు. ఋణ మంజూరు, రికవరీలో అన్ని శాఖలు బ్యాంకర్స్ సమన్వయంతో పని చేసినట్లయితే లక్ష్యాలను అధిగమించ వచ్చన్నారు. కౌలు రైతులకు ఋణ మంజూరులో ఇబ్బందులు ఉంటే పశురుణాలను ఇవ్వాలని బ్యాంకార్లకు సూచించారు. మత్స్యకారులకు రుణాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో రామభద్రపురం, బొబ్బిలి మండలల బ్యాంకర్లు, వ్యవసాయ, వెలుగు, మెప్మా, సిబ్బంది పాల్గొన్నారు.

రుణ లక్ష్యం రూ.1353 కోట్లు

స్వయం సహాయక సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1353 కోట్లు రుణ లక్ష్యాన్ని పెట్టుకున్నామని, ఇప్పటి వరకు రూ.120 కోట్లు అందజేసామని డిఆర్‌డిఎ పీడీ కె.కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 40 వేల సంఘాలకు గాను 29,186 సంఘాలు రుణ అర్హత సాధించాయన్నారు. స్త్రీనిధి రుణ లక్ష్యం రూ.160 కోట్లకు గాను రూ.39.4 కోట్లు ఇప్పటి వరకు అందజేసామన్నారు. స్త్రినిధి అక్రమాలు అరికట్టేందుకు పేటియం చెల్లింపులు జరుపుతామని చెప్పారు. పొదుపు సంఘాల్లో రూ.600 కోట్లు కార్పస్ ఉందని అన్నారు. పిఎంఇజిపి కింద 112 యూనిట్లుకు గాను రూ.27 కోట్లు అందజేశామన్నారు. 99.5 శాతం రికవరీ చేశామని, వ్యక్తి గత రుణం రూ.5 లక్షలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

గ్యాస్ట్రిక్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి– గరివిడి

స్థానిక వి గ్రాండ్‌లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులకు గ్యాస్ట్రిక్ వ్యాధులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహేంద్ర హాస్పిటల్ డాక్టర్ బెవర మహేంద్రగిరి మాట్లాడుతూ అధిక మద్యం, మసాలా ఆహారం తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్, క్లోమ గ్రంధి సమస్యలు వస్తున్నాయన్నారు. దీంతో అరుగుదల లోపం, పుల్లటి తేనుపులు, లక్షణాలు ఉంటే ప్రాథమిక పరీక్ష ఎండోస్కోపీ చేసుకోవాలని సూచించారు. సదస్సులో ఏపండిసైటిస్, కేన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ రాష్ట్ర ఫెడరేషన్ ఆధ్వర్యంలో 34 సంఘాలు కలిసి ఒక జెఎసిగా ఏర్పడి రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం అందించి ఆగిన శిక్షణ తరగతుల కొనసాగించాలని త్వరలో ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. సదస్సులో డాక్టర్ జయ శంకర్ కృష్ణ, సంఘం ప్రతినిధులు, జోనల్ నాయకులు అల్లాడ త్రినాథ రావు, మమ్ముల తిరుపతిరావు, జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు, నియోజవర్గ గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మహేంద్ర గిరి

అనర్హులకు పింఛన్లపై విచారణ

ప్రజాశక్తి – రామభద్రపురం

వైసిపి ప్రభుత్వ హయాంలో అనర్హులకు పింఛన్లు మంజూరు చేసి ఇచ్చారని టిడిపి నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం అధికారులు విచారణ జరిపారు. మండల పరిధిలోని శిష్ఠు సీతారాంపురం గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న పిల్లల తల్లిదండ్రులకు, సదరం సర్టిఫికేట్లు మంజూరు చేయడంతో పాటు తక్కువ అంగవైకల్య శాతం ఉన్నవారికి కూడా వికలాంగ, తదితర పింఛన్లు మంజూరుకావడంపై ఇఒపిఆర్‌డి రమణ, మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమలప్రసాద్‌లు పంచాయతీ కార్యాలయంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. పింఛన్లు పొందుతున్నవారి ధృవపత్రాలు పరిశీలించి వారి అభిప్రాయాలను కూడా నమోదు చేశారు. అర్హులకు మాత్రమే పింఛన్లు ఉండాలని, నిబంధనల మేరకే పింఛన్లు మంజూరు చేయాలని ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ భర్త కర్రోతు వెంకన్న తెలిపారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని విచారణ అధికారులు తెలిపారు. ఈ విచారణలో ఉప సర్పంచ్ కర్రోతు అప్పలనాయుడు, గ్రామ కార్యదర్శి, మహిళా పోలీసు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ రైతుల ఆందోళన

ప్రజాశక్తి– మెంటాడ

గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు ఇరు పక్కల పంట పొలాలకు రహ దారులు కల్పించాలని రైతులు ఆందోళన చేపట్టారు. మంగళవారం హైవే పై ఆందోళన చేపట్టడంతో జాతీయ సహాయ ప్రాజెక్టు అధికారి కిరణ్ రైతులతో చర్చలు జరిపారు. ఎక్కడెక్కడ రహదారులు కేటాయించాలో రైతులు అధికారులకు చూపించారు. కల్వర్టులు ఎత్తుగా నిర్మించడంతో పంట పొలాల్లోని వర్షపు నీరు పోవడంలేదని చెప్పారు. సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసువెళతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు, మండల విజయ్ కుమార్, పతివాడ విశ్వేశ్వరరావు, పసుపురెడ్డి గోవింద, పాండ్రంకి సన్యాసిరావు, నడుపూరు తవిటినాయుడు రైతులు పాల్గొన్నారు.



అధికారికి సమస్యను వివరిస్తున్న రైతులు

లైన్ షోయింగ్ ద్వారా అధిక దిగుబడులు

ప్రజాశక్తి–కొత్తవలస

నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి నారు మడులను జిల్లా వ్యవసాయాధికారి వి.టి. రామారావు మంగళవారం క్షేత్ర స్థాయిలో తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉన్నందున వరినారు బాగానే ఉందని, నారు బాగా ఎదుగుదల కోసం నానో డిఎపి పిచికారి చేయాలని తెలిపారు. అనంతరం కౌలు రైతులకు లోన్ అందించాలని కాంటకాపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌ని కలిసి సంప్రదించారు. కార్యక్రమంల వ్యవసాయ సహాయక సంచాలకులు ఎల్. విజయ, మండల వ్యవసాయ అధికారిణి మాధురి శరణ్య, వ్యవసాయ విస్తరణ అధికారి గణేష్, వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు, అయ్యప్ప, రవి ప్రకాష్, ప్రసాద్ రైతులు, పాల్గొన్నారు.



వేపాడ : లైన్ షోయింగ్ ద్వారా నాట్లు వేస్తున్న సిబ్బంది

జామి: సిరుకు పాలెం గ్రామంలో ఆర్‌టివి హేమ సుందర్ ఆధ్వర్యంలో కాంపాక్ట్ బ్లాక్‌లో బీజామృతంతో నారు శుద్ధి చేసి, చివర్ల తుంచి వరి నారు వరుసలలో నాటించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హేమసుందర్ మాట్లాడుతూ వరిలో తెగుళ్ల నివారణకు క్వాలిటీ బీజామృతంతో నారు శుద్ధి చేసి చివర్ల తుంచి వరుసలలో వరి నాట్లు వేసుకో వాలన్నారు కార్యక్రమంలో ఎంటి కోటిబాబు, ఎల్‌వన్ చరణ్, ఐసిఆర్‌పిలు రామారావు, సరోజినీ, నాగమణి రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కేజిపూడి, చిట్టివానిపాలెం గ్రామాల్లో సబల్ టీమ్, ఎపి సిఎన్ఎఫ్ అనుసంధానంతో వరిలో లైన్ షోయింగ్ కార్యక్రమం నిర్వహించారు. వరిలో లైన్ షోయింగ్ చేయడం వల్ల కలుపు నివారణకు అయ్యే ఖర్చు తగ్గుతుందన్నారు. వరిలో తూర్పు, పడమర దిశలుగా వరుసలలో వరి నాట్లు వేసుకుంటే గాలి, వెలుతురు బాగా తగలటం వల్ల ఎటువంటి తెగుళ్ళు, చీడపీడలు సోకకుండా ఉంటాయన్నారు. రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆర్‌టిఇ హేమసుందర్ చిట్టివానిపాలెం రైతులకు తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రావణి, సి.ఎస్.ఎ రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ వీరభద్రస్వామి, ఎమ్‌టిఎల్ వసంత, ఎమ్‌టి ఈశ్వర్ రావు, ఐసిఆర్‌పి అర్జున్, రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి, రైతులు వరి నారుమడి యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని, ఎఒ పి.నిర్మల తెలిపారు, మండలంలోని చొల్లంగిపేట, డిఆర్ పాలెం గ్రామంలో ఆమె పర్యటించారు. గత వారం రోజులుగా పడుతున్న వర్షాలకు నువ్వు పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతూ, నష్టపోయిన రైతుల నివేదికను పై అధికారులకు పంపిస్తామని, రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం అధికారి టి.సంగీత, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఇ.లలిత, సర్పంచ్ కోరాడ కనకరాజు, రైతులు తదితరు పాల్గొన్నారు.



కొత్తవలస: సమస్యను వ్యవసాయాధికారికి వివరిస్తున్న రైతు

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో యూనిట్ వ్యవసాయ అధికారి శిరీష ఆధ్వర్యంలో అడిషనల్ డిపిఎం స్వామి అగ్ని అస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. వరి, మొక్క జొన్న పంటపై దీన్ని వినియోగిం చడం వల్ల కొమ్మతులుచే పురుగు, కత్తెర పురుగు నివారణ చేయవచ్చు నన్నారు.

గజపతి నగరం: నారుకొనలను తుంచడం వల్ల తెగులు, పురుగు ఉధృతి తగ్గించి ప్రయోజనాలు పొందవచ్చని ఎడిఎ మహరాజన్ అన్నారు. మంగళ వారం మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో ఆయన పంటపొలాలలో ఉన్న వరి నాట్లను సందర్శించి రైతులకు సూచనలు చేశారు. నారుని పొలం అంతా ఒకే విధంగా పై పైన నాటినప్పుడు పొలం అంతా ఒకేసారి కోతకు వస్తుందని తెలిపారు కార్యక్రమంలో ఎంఎఒ సిహెచ్. ధనలక్ష్మి, విఎఎ ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రాధాన్యత : పువ్వల

ప్రజాశక్తి–బొబ్బిలి

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇచ్చారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి రూ 15వేల కోట్లు కేటాయించడం, పోలవరం నిర్మాణం పూర్తి చేస్తామని, వైజాగ్–చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తామడంపై ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వడం వెనుక సీఎం చంద్రబాబు కృషి ఉందన్నారు.